శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:49 సూర్యాస్తమయం - సా. 6:11 తిథిః ఏకాదశి రా. 8:19 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మృగశిర సా. 6:07 వరకు తరువాత ఆరుద్ర యోగం వైధృతి మ. 1:57 వరకు కరణం వనిజ ఉ. 8:49 వరకు విష్టి రా. 8:19 వరకు వర్జ్యం రా. 2:26 నుండి తె. 4:01 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:05 వరకు రాహుకాలం ఉ. 9:39 నుండి ఉ. 11:05 వరకు యమగండం మ. 1:55 నుండి మ. 3:20 వరకు గుళికాకాలం ఉ. 6:49 నుండి ఉ. 8:14 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:13 నుండి ఉ. 6:01 వరకు అమృత ఘడియలు ఉ. 9:30 నుండి ఉ. 11:03 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు

e-paper

# ఈ-కబురు


ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

శనివారం | 8-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com

## సోనుసూద్‌ను అరెస్ట్ చేయండి..

కోర్టు ఆదేశాలు

సినీ కబుర్లు



# ఫ్రాన్స్,అమెరికాలో ప్రధాని మోదీ పర్యటన

## విదేశీ పర్యటనకు బయలుదేరుతున్న ప్రధాని మోదీ



- ఫ్రాన్స్, అమెరికాలో మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు
- ఫ్రాన్స్‌లో ఏఐ సదస్సుకు హాజరు కానున్న ప్రధాని
- ఫ్రాన్స్ అధ్యక్షుడితో ఏఐ యాక్షన్ కమిటీ సమావేశం
- న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను పరిశీలించనున్న మోదీ
- అమెరికా చేరనున్న మోదీ - ట్రంప్‌తో భేటీ
- ద్వైపాక్షిక చర్చలకు అవకాశం
- 12 వరకు ఫ్రాన్స్‌లో పర్యటించనున్న మోదీ
- 12, 13 తేదీల్లో అమెరికాలో పర్యటన..

భారత ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఫ్రాన్స్, అమెరికా దేశాలలో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.. మోదీ విదేశీ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు అధికారికంగా చేశారు.

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 07 : ఈ నెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఫ్రాన్స్‌లో, 12వ తేదీ నుండి 13వ తేదీ వరకు అమెరికాలో పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శుక్రవారం ప్రకటించారు. ప్యారిస్‌లో జరిగే ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సదస్సులో ఈ నెల 10వ తేదీన ప్రధానమంత్రి మోదీ ఫ్రాన్స్‌కు బయలుదేరతారు. ఫ్రాన్స్ అధ్యక్షుడితో కలిసి ఏఐ యాక్షన్ కమిటీ సమావేశానికి (మిగతా 2 వ పేజీలో)

# తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్టే

## రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదన్న రేవంత్ రెడ్డి..

- కేబినెట్ విస్తరణపై ఆశావహులకు నిరాశ
- అధిష్ఠానం నిర్ణయమే కీలకం: రేవంత్ రెడ్డి
- ప్రతిపక్ష నేతల అరెస్టుపై స్పష్టత
- సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- కుల గణన సర్వే ద్వారా ముస్లిం రిజర్వేషన్లకు పరిష్కారం
- బీసీల సంఖ్యలో ఐదున్నర శాతం పెరుగుదల
- పీసీసీ కార్యవర్గ కూర్పు త్వరలో పూర్తి



ఆశావహులు మరికొంత కాలం వేచి ఉండక తప్పదు.. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నాయకులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది.తెలంగాణ కేబినెట్ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఆశావహులకు షాకింగ్ న్యూస్ చెప్పారు.

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 07 : ఢిల్లీ పర్యటనలో భాగంగా సీయం శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, మంత్రివర్గంలో ఎవరు ఉండాలనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. తాను మాత్రం ఎవరి పేరునూ ప్రతిపాదించడం లేదన్నారు.

ప్రతిపక్ష నేతలపై కేసుల విషయమై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. కేసుల విషయంలో చట్ట ప్రకారం వెళతామన్నారు. ప్రతిపక్ష నేతలను త్వరగా అరెస్ట్ చేసి జైల్లో వేయాలనే ఆలోచన తమకు లేదన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా తాము పని చేస్తున్నామని ఆయన అన్నారు.

అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తాము కుల గణన సర్వే చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. కుల గణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లవుతుందన్నారు. కుల గణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగినట్లు తెలిపారు. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చిందని, రెండ్రోజుల్లో ప్రకటన ఉంటుందని ఆయన తెలిపారు.



## కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం

2



## ఏఐసీసీ అధ్యక్షుడితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

2



## కులగణనతో బీజేపీకి ఏం సంబంధం?

2



# ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?

హిందూ బీసీ, ముస్లిం బీసీ విభజనపై అభ్యంతరం

- కాంగ్రెస్ పై కిషన్ రెడ్డి ఫైర్
- కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ప్రశ్నలు
- కులగణన విధానం పై విమర్శలు
- దేశవ్యాప్తంగా ఎక్కడా లేని విధానం
- బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తున్నదా?

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 07 : హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలను బీసీల్లో (మిగతా 2 వ పేజీలో)



# చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అండగా ఉంటాం

- పారిశ్రామికాభివృద్ధితో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం
- హెచ్‌సీ రోబోటిక్స్ రూ.500 కోట్ల పెట్టుబడులతో ముందుకు
- హైదరాబాద్ కేంద్రంగా 9 దేశాల్లో కార్యకలాపాలు
- గ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలు,టైర్ 2 నగరాల్లో ఐటీ విస్తరణ
- కరీంనగర్‌లో సెంటిలియాన్ నెట్‌వర్క్స్ కార్యకలాపాల ప్రారంభం
- చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.4,500 కోట్ల పెండింగ్ బకాయిల విడుదల
- కేటాయించిన భూముల దుర్వినియోగంపై చర్యలు తప్పవన్న హెచ్చరిక
- పరిశ్రమల పునరుద్ధరణకు హెల్త్ క్లినిక్‌పై అధ్యయనం
- దావోస్ ఒప్పందాల్లో 17 అమలులో - కొత్తగా రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంపై మంత్రి శ్రీధర్‌బాబు విమర్శలు
- గత ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తామని హామీ

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించి తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సెంటిలియాన్ నెట్ వర్క్స్ కు చెందిన హెచ్ సీ రోబోటిక్స్ ముందుకొచ్చినట్లు వివరించారు.

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 07 : ఆ వివరాలను శుక్రవారం కంపెనీ ప్రతినిధులతో కలిసి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సెంటిలియాన్ నెట్ వర్క్స్, హెచ్‌సీ రోబోటిక్స్ తొమ్మిది దేశాల్లో డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ సాఫ్ట్ వేర్, టెలి కమ్యూనికేషన్, రోబోటిక్స్, విమాన రక్షణకు సంబంధించిన సాఫ్ట్ వేర్ అభివృద్ధితో పాటు పలు రంగాల్లో (మిగతా 2 వ పేజీలో)



2

# దామరవంచ గురుకులంలో ఫుడ్ పాయిజన్..

- రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తిన హరీశ్‌రావు
- మహబూబాబాద్ గురుకులంలో ఫుడ్ పాయిజన్ కలకలం
- ఫుడ్ పాయిజన్ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- గత ఏడాదిలో వందల ఫుడ్ పాయిజన్ కేసులు
- సీఎం రేవంత్ రెడ్డి హామీలకు, కార్యాచరణకు విరుద్ధత
- ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్
- ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి

# ఎఐసీసీ అధ్యక్షుడితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

## భేటీలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్

## గజ్వేల్‌లో నిర్వహించబోయే ఎస్సీ వర్గీకరణ సభకు ఖర్గేకు ఆహ్వానం...

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 07 : ఢిల్లీ పర్యటనలో కాంగ్రెస్ అగ్ర నేతలను కలవడంతో రాష్ట్రనేతలు బిజీబిజీగా ఉన్నారు. అధినేతలను కలవడంతో పాటు అనుమతులు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో నిర్వహించబోయే సభల విషయంలో కూడా అగ్ర నాయకత్వం అనుమతి తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ



అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ కార్యవర్గంతో పాటు పలు అంశాలపై ఖర్గేతో చర్చించారు.

ఎస్సీ వర్గీకరణ, కుల గణన అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వెల్లడించారు. సూర్యాపేటలో ఈ నెలలో నిర్వహించనున్న బీసీ కుల గణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు రావాలని ఖర్గేను ముఖ్యమంత్రి కోరారు.



# కులగణనతో బీజేపీకి ఏం సంబంధం?

## మంత్రి పొన్నం ప్రభాకర్

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 07 : బీసీ కులగణన ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులగణనపై కుల సంఘాల నేతలకు వివరిస్తామని చెప్పారు. శుక్రవారం కరీంనగర్ లో ఓ మీడియా చానల్ తో మాట్లాడిన ఆయన.. సర్వే నివేదికపై ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొనలేదు. కానీ అవహేళన మాత్రం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు వెనుకబడిన వర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొనని వారికి కులగణనపై మాట్లాడే అవకాశం లేదన్నారు. వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉరుకుంటామా అని ప్రశ్నించారు. కులగణన చేయబోమని కేంద్రంలో బీజేపీ అఫిడవిట్ ఇచ్చింది. కులగణనతో బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. బీజేపీ ఫ్యూడలిస్టిక్ పార్టీ అని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన చేయాలనే డిమాండ్ ఉంది. కానీ ఇప్పటివరకు చేయలేదు. కానీ మా ప్రభుత్వం కులగణన ప్రక్రియను పక్కాగా పూర్తి చేసిందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చేందుకు మా పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కులగణనను దేశం మొత్తం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

# కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం

## అమెరికాలోని ప్రతిష్ఠాత్మక నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానం

## ఐబీసీ-2025 సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రసంగించాలని విజ్ఞప్తి

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 07 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్ కు మరో అరుదైన గౌరవం లభించింది. అమెరికాలోని ఇల్లినాయ్ రాష్ట్రం, ఇవాన్ స్టన్ లో ఉన్న ప్రతిష్ఠాత్మక నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఏప్రిల్ 19న జరిగే కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్-2025 లో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించాలని కేఐబీసీ వైస్ ప్రెసిడెంట్ చెనాక్షా గోరెంట్ల లేఖలో ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ప్రశంసించారు.. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ వంటి వినూత్న ఆలోచనల వల్ల తెలంగాణలో సరికొత్త స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందిందని, ఇది దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రపంచ ఇన్నోవేషన్ హబ్ గా హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ వేదికగా భారత్ లో పెరిగిన ఈ స్టార్టప్ ఎకో సిస్టమ్ గురించి, సాంకేతికరంగంలో వస్తున్న ఈ విప్లవాత్మక మార్పుల గురించి మరింత తెలుసుకోవాలని అమెరికాలోని బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టేలా వారిని కేటీఆర్ మెప్పించి ఒప్పించిన తీరు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ డిజిటల్ యుగంలో యువతకు హైదరాబాద్‌ను ఉపాధి అవకాశాల గనిగా తీర్చిదిద్దడం అద్భుతమన్నారు. అలాగే ఔత్సాహికులైన యువతీ యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కేటీఆర్ వేసిన ప్రణాళికలు కూడా తెలంగాణలో గొప్ప ఫలితాలు



సాధించాయన్నారు. పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం ద్వారా కేటీఆర్ గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కూడా బంగారు బాటలు వేశారని అభినందించారు. స్వల్ప కాలంలోనే కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి సాధించడానికి కేటిఆర్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఎంతో కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రిగా దశాబ్దకాలంలో రూపొందించిన ప్రణాళికలు, సాధించిన విజయాల తాలూకూ అనుభవాలను విద్యార్థులకు వివరించాలని లేఖలో విజ్ఞప్తిచేశారు. సుస్థిర అభివృద్ధికి ఎలా, పునాదులు వేయాలో, పరిపాలనలో సాంకేతికతను జోడించి, మెరుపు వేగంతో ఎలా మెరుగైన ఫలితాలు సాధించాలో సూచనలు చేయాలని కోరారు.. కేవలం తమ విద్యార్థులకే కాకుండా, సదస్సుకు హాజరయ్యే యువ పారిశ్రామికవేత్తల్లో కూడా కేటీఆర్ ప్రసంగం స్ఫూర్తి నింపడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు

# ఫ్రాన్స్,అమెరికాలో ప్రధాని మోదీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)



ఆయన అధ్యక్షత వహిస్తారు. ఆ తర్వాత అక్కడి న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను ప్రధానమంత్రి పరిశీలిస్తారు. 12వ తేదీ సాయంత్రం మోదీ ఫ్రాన్స్ నుండి బయలుదేరి వాషింగ్టన్ చేరుకుంటారు. 13వ తేదీ ఉదయం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమవుతారని సమాచారం. ఈ సందర్భంగా పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది.

# ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు

(మొదటి పేజీ తరువాయి)



ఎలా కలుపుతారని నిలదీశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దీనిపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇవాళ ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసలు కులగణన జరిపిన విధానమే సరిగా లేదని, 50 శాతం ఇళ్లకు సర్వే సిబ్బంది వెళ్లనేలేదని ఆరోపించారు. తెలంగాణలో కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్య వల్ల బీసీల సంఖ్య తగ్గిందన్నారు. ఇది చాలా విచారకరం అని చెప్పారు. తూతూమంత్రంగా సర్వే చేశారని విమర్శించారు. ఈ సర్వేపై అనేక బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

### ఈ విధానం దేశంలో ఎక్కడా లేదు..

తెలంగాణలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ సర్కార్ ముస్లిం బీసీ, హిందూ బీసీలు అని కొత్త పాలసీ తెచ్చిందని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి విధానం దేశంలో మరెక్కడా లేదని స్పష్టంచేశారు. ప్రజలను కులం, మతం పేరుతో విభజించడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి అలవాటేనని దుయ్యబట్టారు. తమకు న్యాయం కావాలని ఓ వైపు బీసీలు కొట్లాడుతుంటే ముస్లింలను తీసుకొచ్చి బీసీల్లో కలపడం ద్వారా వారికి కాంగ్రెస్ పార్టీ మరింత అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఇది పూర్తిగా బీసీ వ్యతిరేక విధానం అని తేల్చి చెప్పారు.

# దామరవంచ గురుకులంలో ఫుడ్ పాయిజన్..

**ఈ-కబురు, హైదరాబాద్**



ఫిబ్రవరి 07 : మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు ఆసుపత్రి పాలు అయ్యారు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఫుడ్ పాయిజన్ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒకటి కాదు రెండు కాదు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వందల్లో జరిగాయన్నారు. వందల మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారన్నారు.

కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని.. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీన స్థితే నిదర్శనమంటూ చురకలంటించారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 50 ఏళ్లపాలనలో అభివృద్ధి శూన్యం

## పార్లమెంటులో ఎంపీ ఈటల ఆగ్రహం

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 07 : కాంగ్రెస్ ఈ దేశాన్ని 50 సంవత్సరాల కంటే ఎక్కువ పరిపాలన చేసిందని, ఆపార్టీ నేతలు పదేపదే రాజ్యాంగాన్ని పట్టుకొని వస్తున్నారని, అందులో అభివృద్ధి ఫలాలు అందరికి అందాలి అనే విషయం కనిపించడం లేదని అని ఎంపీ ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. ఇంత కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఆయన పార్లమెంటులో ప్రసంగిస్తూ దేశంలోనే కాదు వివిధ రాష్ట్రాల్లో కూడా పరిపాలన చేసిందని, రాష్ట్రాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు జిల్లాల వారీగా కేటాయింపులు ఉండవనే సంగతి వారికి తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం బడ్జెట్ కూడా రాష్ట్రాల వారీగా కేటాయింపులు ఉండవని, దేశంలో ఉన్న రైతులు, యువకుల అందరి కోసం పథకాలు కేంద్రం తీసుకువస్తోందని గుర్తు చేశారు. కేటాయి ంపుల విషయంలో కొత్తగా గెలిచి వచ్చిన పార్టీ తరహాలో కాంగ్రెస్ నేతలు మాట్లాడటం ఈ ప్రజాస్వామ్యంలో అత్యంత బాధాకరమన్నారు. 2014లో ప్రధాని మోడీ రాష్ట్రాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది అనే మూల సూత్రాన్ని చెప్పారు. అందుకే రాష్ట్రాలకు నిధుల కేటాయింపు పెంచారని, ఒక్కో రాష్ట్రం ప్రభుత్వం వారి ప్రాధాన్యతతో ముందుకు పోతున్నాయని తెలిపారు. 2014 వరకు టాక్స్ విషయంలో రాష్ట్రాలకు కేటాయింపులు 32 శాతం ఉండేదని, మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. రాష్ట్రాలలో అభివృద్ధి జరగాలని 42 శాతానికి పెంచి విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

### గ్రామాలకు నిధులు ఇచ్చేంది కేంద్ర ప్రభుత్వమే



తెలంగాణలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీతాలు ఇవ్వటాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్నారు. కానీ గ్రామాల్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థకు, చెట్లు పెంచడానికి, కరెంటుకు, రోడ్లకు, చివరికి గ్రామాల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు కూడా డబ్బులు ఇస్తున్నది కేంద్రమే అనే విషయం మర్చిపోవద్దని సూచించారు. తెలంగాణలో రైల్వే లైన్లను సింగిల్ లైన్లను, డబుల్ లైన్లు ఢిల్లీకి 4వ లైన్లను తయారు చేస్తున్నారని, వేల కోట్ల రూపాయలు రైళ్ల కోసం ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. స్మార్ట్ సిటీలు, అమృత్ నగర్ల పేరుతో వేలకోట్ల రూపాయలు అర్బన్ ఏరియాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులు మాత్రమేనన్నారు.

# చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

సేవలు అందిస్తూ.. 2వేల మందికి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు.తాజాగా మరో రూ.500 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారన్నారు. ఫలితంగా ఈ ఏడాది 500 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయనీ ఈ సంఖ్య మూడేళ్ల లో 2 వేలకు చేరుతుందని అన్నారు. ఇప్పటి వరకు ఐటీ రంగంలో పెట్టుబడులన్నీ హైదరాబాద్ కే పరిమితమయ్యాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల యువతకు ఉద్యోగాలను కల్పించాలనే సంకల్పంతో ద్వితీయ, తృతీయ శ్రేణి ( టైర్1, టైర్2 ) నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలని సంకల్పించినట్లు వెల్లడించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఆ దిశగా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. సెంటిలియాన్ నెట్ వర్క్స్ సంస్థ ఇప్పటికే తమ కార్యకలాపాలను కరీంనగర్ లో ప్రారంభించిందని, దీంతో మరికొన్ని సంస్థలు కూడా ముందుకొచ్చాయని శ్రీధర్‌బాబు వివరించారు.రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అండగా ఉంటామని, వీరికి రావాల్సిన ప్రోత్సాహకాలు రూ.4, 500 కోట్లు గత 2016 నుంచి పెండింగ్లో ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి రాగానే ఈ బకాయిలను



చెల్లించేందుకు చొరవ తీసుకున్నామన్నారు. సహేతుక కారణాలు చూపకపోతే గతంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలో కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. ఇతర అవసరాలకు భూములను వినియోగిస్తున్న వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.పరిశ్రమల పునరుద్ధరణకు గతంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ పై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నామన్నారు. దీని వల్ల పరిశ్రమలకు మేలు జరుగుతుందని భావిస్తే అధిక నిధులు కేటాయించి యథావిధిగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉందని, గతేడాది దావోస్ లో చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయన్నారు. 10 ఒప్పందాల పురోగతి 50 శాతం కంటే ఎక్కువగా ఉందన్నారు. కేవలం ఒప్పందాలు చేసుకుని రావడమే కాదు.. వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది కూడా దావోస్ తదితర ప్రాంతాల్లో తాము రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నామన్నారు.

కాంగ్రెస్‌పార్టీగా తాము ఉద్యోగాలను కల్పించేందుకు పాటు పడుతుంటే.. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. తాము ప్రతిపక్షంలో ఉండగా ఎన్నడూ భూసేకరణ పనులను అడ్డుకోలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించామని, ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతూ అభివృద్ధికి అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. తమకు రాజకీయాలు కాదు..రాష్ట్రాభివృద్ధే ముఖ్యం... పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వం తీసుకున్న పాలసీలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సెంటిలియాన్ నెట్ వర్క్స్ ఛైర్మన్, ఎండీ వెంకట్, డైరెక్టర్ రాధా కిషోర్, ఆ సంస్థ ఇండియా ఆపరేషన్స్ హెడ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం

**ఈ-కబురు,లక్నో**

ఫిబ్రవరి 07 : కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్-18 శంకరాచార్య మార్గంలో మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పే ప్రయత్నం చేస్తోంది. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అగ్ని ప్రమాదంపై ఎస్పీ సర్వేష్ కుమార్ స్పందించారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితం సెక్టార్-22లో మంటలు చెలరేగాయి. ఓ గుడారంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడం వల్లే ప్రమాదం జరిగింది. అక్కడి నుంచి క్రమంగా మంటలు వ్యాపించడంతో 18 టెంట్‌లు ఆహుతయ్యాయని పోలీసులు తెలిపారు. మరోవైపు, దట్టమైన పొగ వ్యాపించడంతో భక్తులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. దీంతో ప్రాణనష్టం తప్పింది.అంతకుముందు .. ఇదే కుంభమేళాలో తొక్కిసలాట కారణంగా 30 మంది భక్తులు మృతిచెందారు. 60 మంది గాయపడ్డారు. ఇలా వరుస ఘటనలతో అప్రమత్తమైన సీఎం యోగీ సర్కార్ తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. అయినప్పటికీ వరుస ప్రమాదాలు జరుగుతుండడంపై యోగీ సర్కార్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఫుడ్ ఆప్షన్ ఎంచుకోకపోయినా వందే భారత్‌లో మీల్స్!

**ఈ-కబురు,న్యూఢిల్లీ**



ఫిబ్రవరి 07 : వందే భారత్ రైళ్లలో ప్రయాణీకులకు భారతీయ రైల్వే కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఎవరైనా టికెట్ బుకింగ్ సమయంలో ఫుడ్ ఆప్షన్ ఎంచుకోకపోయినా.. ప్రయాణ సమయంలో కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఆహారం అందుబాటును బట్టి సిబ్బంది ఆహారాన్ని అందజేస్తారని రైల్వే బోర్డు శుక్రవారం తెలిపింది. ఈ మేరకు ఐఆర్‌సీటీసీకి లేఖ రాసింది. టికెట్ బుక్ చేసుకున్నప్పుడు ఫుడ్‌ను ఎంచుకోని వారికి, కరెంట్ బుకింగ్ ప్రయాణికులకు ఈ సదుపాయం ప్రయోజనకరంగా ఉండనుంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు టికెట్ బుక్ చేసుకునేటప్పుడు మీల్స్ అనేది ఆప్షనల్‌గా ఉంటుంది. కొందరు ప్రత్యామ్నాయాలు చూసుకోవచ్చన్న ఉద్దేశంతో ఫుడ్ ఆప్షన్‌ను తొలగిస్తుంటారు. అనుకోని కారణాల వల్ల అలా ఏర్పాటు చేసుకోవడంలో విఫలమైన సందర్భంలో రైళ్లలోనే డబ్బులిచ్చి కొందామన్నా.. ఆహారాన్ని ఇచ్చేందుకు సిబ్బంది నిరాకరిస్తున్నారు. డబ్బులు చెల్లించేందుకు ముందుకొచ్చినా తమకు ఆహారం ఇవ్వడం లేదంటూ ఐఆర్‌సీటీసీకి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ క్రమంలోనే కొత్త సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు రైల్వే బోర్డు తెలిపింది. అలాగే, రైళ్లలో అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐఆర్‌సీటీసీకి సూచించింది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు రాత్రి 9 గంటల తర్వాత ట్రాలీల రూపంలో విక్రయాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లేఖలో ప్రస్తావించింది.

# కూలుతున్న స్టార్‌లింక్స్..

## ఎలాన్ మస్క్ కంపెనీతో భారీగా వాతావరణ కాలుష్యం

**ఈ-కబురు,న్యూయార్క్**

ఫిబ్రవరి 07 : ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్ శాటిలైట్లు క్రాష్ అవుతున్నాయి. భూ వాతావరణంలోకి ప్రవేశించి మండిపోతున్నాయి. 2025 జనవరి నెలలోనే సుమారు 120కి పైగా స్టార్‌లింక్స్ క్రాష్ అయ్యాయి. ఈ మేరకు అంతరిక్షంలోని వస్తువులపై అధ్యయనం చేసే ఖగోళ శాస్త్రవేత్త జోనాథన్ మెక్‌డొవెల్ వెల్లడించారు. 'రోజూ 4-5 స్పేస్ ఎక్స్ శాటిలైట్లు భూ వాతావరణంలోకి ప్రవేశించి కాలిపోతున్నాయి' అని ఆయన తెలిపారు.

### ఎందుకు క్రాష్ అవుతున్నాయంటే..?

ఆ కంపెనీ ప్రవేశపెట్టిన మొత్తం 4700 జెన్ 1 శాటిలైట్లలో సుమారు 500 వరకు శాటిలైట్ల జీవితకాలం ముగింపు దశకు వచ్చినట్టు సమాచారం. వీటి స్థానంలో కొత్త మోడల్ శాటిలైట్లను ప్రవేశపెట్టాల్సిన అనివార్యత ఏర్పడింది.శాటిలైట్ల క్రాష్ వల్ల వాతావరణానికి కలిగే నష్టంపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానివల్ల ఓజోన్ పొరకు నష్టం వాటిల్లుతున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



# మహారాష్ట్ర ఎన్నికలపై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు..

## వెంటనే స్పందించిన 'ఈసీ'

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 07 : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) వెంటనే స్పందించింది. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రశ్నలను,సూచనలను తాము గౌరవిస్తున్నామని త్వరలో ఈ విషయంపై స్పందిస్తామని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్ల జాబితా వివరాలన్నీ రాతపూర్వకంగా వెల్లడిస్తామని తెలిపింది. ఈ మేరకు ఈసీ శుక్రవారం(ఫిబ్రవరి7) ఒక ప్రకటన విడుదల చేసింది.

కాగా, ఈసీ ప్రకటనకు ముందు రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. జనాభా కంటే ఎక్కువగా మహారాష్ట్ర ఎన్నికల్లో పలు చోట్ల ఓట్లు నమోదయ్యాయన్నారు.




గతేడాది మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు, నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కొత్తగా 35 లక్షల మంది ఓటర్లుగా చేరడమేంటని రాహుల్ ప్రశ్నించారు.

ప్రతిపక్షాలకు చెందిన పార్టీలన్నీ కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని మహారాష్ట్ర ఓటర్ల జాబితాపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. బలహీన వర్గాలకు చెందిన ఎందరో ప్రజల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించారని,కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నా అక్కడి ఓటర్లను మరో పోలింగ్ బూత్‌కు మార్చారని ఆరోపించారు.

మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తమకు ఇవ్వాలని ఈసీని కోరామని, దీనిద్వారా కొత్తగా చేరిన ఓటర్లు ఎవరనేదానిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఇంతేగాక ఎంతమంది ఓటర్లను తొలగించారో,ఒక బూత్‌నుంచి మరొక బూత్‌కు ఓటర్లను ఎందుకు బదిలీ చేశారో తెలుస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలున్నందునే ఓటర్ల జాబితాను తమకు ఇచ్చేందుకు ఈసీ ముందుకు రాలేని రాహుల్ అన్నారు.

# శంషాబాద్‌లో మళ్లీ హైడ్రా కొరడా..



- శంషాబాద్ మున్సిపాలిటీలో హైడ్రా దాడులు
- అనుమతిలేని 39 హోర్డింగ్‌ల తొలగింపు
- హోర్డింగ్ యజమానులపై చర్యలు తప్పవన్న కమిషనర్
- చెరువులు, కుంటల ఆక్రమణపై చట్టపరమైన చర్యలు
- సంపత్ నగర్, ఊట్పల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత
- ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై హెచ్చరికలు
- చట్టవిరుద్ధ నిర్మాణాలపై హైడ్రా కఠిన చర్యలు

> శంషాబాద్ మున్సిపాలిటీలో శుక్రవారం(ఫిబ్రవరి7) హైడ్రా కొరడా ఝులిపించింది. రోడ్డుపై అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన 39 హోర్డింగ్‌లను తొలగించింది. హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

**ఈ-కబురు,శంషాబాద్**

ఫిబ్రవరి 07 : ఈ క్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. శంషాబాద్ మున్సిపాలిటీలో చెరువులు కుంటలు కూడా కబ్జా అయినట్లు తన దృష్టికి వచ్చిందని వాటి పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవలే హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సంపత్ నగర్, ఊట్పల్లిలో అక్రమ కట్టడాలను కూల్చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి కట్టిన నిర్మాణాలను, అలాగే రోడ్లపై అడ్డుగా కట్టిన నిర్మాణాలను తొలగించింది.

సంపత్ నగర్‌లో ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసి కొందరు అక్రమ కట్టడాలను నిర్మించారు. అలాగే ఊట్పల్లిలో రోడ్డుకు అడ్డంగా ఓ గేటును ఏర్పాటు చేశారు. వీటితో పాటు మరికొన్ని నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, పార్క్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హైడ్రా హెచ్చరికలు జారీ చేసింది.

# జీ20 మంత్రుల భేటీకి అమెరికా దూరం

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 07 : దక్షిణాఫ్రికాలో ఈనెలలో జరిగే జీ-20 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి అమెరికా తరఫున ఎవరూ హాజరుకాబోరని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో బుధవారం ప్రకటించారు. ఈ నెల 20, 21 తేదీల్లో జొహన్నెస్‌బర్గ్‌లో జరిగే విదేశాంగ మంత్రుల జీ20 చర్చలను బహిష్కరిస్తున్నట్లు రూబియో చెప్పారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం అమెరికా వ్యతిరేక ఎజెండాతో వ్యవహరిస్తున్నందువల్లే సమావేశానికి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు.ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా గైర్హాజరు జీ20 కూటమికి పెద్ద దెబ్బే. ఉక్రెయిన్ యుద్ధంపై దౌత్యానికి ట్రంప్ మొగ్గుచూపుతున్న విదేశాంగ మంత్రుల భేటీలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో రూబియో తొలిసారిగా భేటీ అవుతారని అంతా అనుకుంటున్న వేళ అసలు అమెరికా ఈ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిందని రూబియో ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.

# ట్రంప్ సర్కార్ మరో షాక్..


## 9,700 మంది ఉద్యోగులు ఔట్!

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 07 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక ట్రంప్.. పాలనలో తనదైనా మార్క్ చూపిస్తున్నారు. తాను చేసిందే శాసనం, తన నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా దూసుకెళ్తున్నారు. ట్రంప్ ఇప్పటికే టారిఫ్‌లు, ఆంక్షల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇక, తాజాగా అమెరికాలోని పలు సంస్థలపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే ఉద్యోగులను తొలగించేందుకు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారు.



అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాలోని కొన్ని సంస్థల్లో ఉద్యోగులను తొలగించేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ప్రపంచంలోనే అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ'లో ఏకంగా 9,700లకు పైగా ఉద్యోగాలు తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్లాన్ చేస్తోంది. అయితే, ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా పదివేల మందికి పైగా ఉద్యోగులున్నారు. దీంతో, ఈ సంఖ్యను తగ్గించాలని ట్రంప్ నిర్ణయించారు. ఈ క్రమంలో కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా బ్యూరో, ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండేలా సవరణలు కూడా చేసినట్టు తెలుస్తోంది.ఇదిలా ఉండగా.. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇక, ప్రభుత్వ ఉద్యోగాల కోత విషయంలో ట్రంప్ సర్కారు ప్లాన్ ఫలిస్తోంది. ది ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఓపీఎం) ఇచ్చిన బైఅవుట్ ఆఫర్ గడువు శుక్రవారంతో ముగియనుంది. ఈనేపథ్యంలో ఇప్పటికే 40,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ కొలువులకు రాజీనామా చేసేందుకు అంగీకరించినట్టు సమాచారం. బైఅవుట్ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి ఒక మెమో వెలువడింది. ఈమేరకు ఒక ఈ-మెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. దీంతో, సుమారు 10-15శాతం మంది దీనిని ఎంచుకోవచ్చని ట్రంప్ కార్యవర్గం భావించింది. ఇది విజయవంతంగా అమలైతే అమెరికా ప్రభుత్వ ఖర్చులు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు తగ్గవచ్చని భావిస్తున్నారు.




# అమెరికాలో విమానం మిస్సింగ్..

## రంగంలోకి దిగిన అధికారులు

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 07 : అమెరికాలో ఓ విమానం అదృశ్యమైంది. పది మందితో అలస్కా మీదుగా వెళ్తున్న విమానం రాడార్ సిగ్నల్స్‌కు అందకుండా పోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు రంగంలోకి దిగారు. విమానం జాడ కనుక్కునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.బేరింగ్ ఎయిర్ సంస్థ కు చెందిన సెస్నా 208బీ గ్రాండ్ కారవాన్ ఎయిర్‌క్రాఫ్ట్ విమానం గురువారం మధ్యాహ్నం 2:37 గంటల సమయంలో అలస్కా పట్టణం ఉనల్కలేట్ నుంచి నోమ్‌కు బయల్దేరింది. ఆ సమయంలో విమానంలో తొమ్మిది మంది ప్రయాణికులు ఒక పైలట్ ఉన్నారు. అయితే విమానం నార్టోన్ సౌండ్ ప్రాంతంలోకి రాగానే రాడార్ సిగ్నల్స్‌కు అందకుండా పోయింది. విమానం జాడ కనుక్కునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అలస్కాలోని ప్రతికూల వాతావరణంగా కారణంగానే విమానం అదృశ్యమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

# ఆనంద్ మహీంద్రా భావోద్వేగ పోస్ట్: దశాబ్దాల క్రితం..



జనవరిలో ఢిల్లీలో జరిగిన 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025"లో.. భారతీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించింది. కంపెనీ ప్రదర్శించిన బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ కార్లు భారతీయులను మాత్రమే కాకుండా.. విదేశీయులను సైతం ఫిదా చేశాయి. జపాన్, కొరియా నుంచి వచ్చిన ప్రతినిధులు ఆ కార్లను ఫోటోలు తీస్తూ కనిపించారు. ఇది మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను భావోద్వేగానికి గురిచేసింది. దశాబ్దాల క్రితం, నేను ఆటో పరిశ్రమలో నా కెరీర్‌ను ప్రారంభించినప్పుడు, విదేశాలలో తయారైన అధునాతన కార్లను ఫోటో తీయడానికి, వాటి గురించి తెలుసుకోవడానికి భారతీయ ప్రతినిధులు అంతర్జాతీయ ఆటో షోలకు వెళ్లేవారు. అయితే ఇప్పుడు దేశీయ వాహనాలను విదేశీయులను ఆకట్టుకుంటున్నాయని.. తన ఎక్స్ ఖాతాలో ఆనంద్ మహీంద్రా భవోద్వేగ పోస్ట్ చేసారు. భారతీయ మార్కెట్లో లాంచ్ అయిన ఎలక్ట్రిక్ కార్లలో మహీంద్రా బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ కూడా ఉన్నాయి. ఇవి సాధారణ ఎలక్ట్రిక్ కార్లకు భిన్నంగా ఉన్నాయి. ఈ రెండూ తమ భవిష్యత్ డిజైన్లు, అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటం వల్ల హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. స్పోర్టీ డిజైన్‌ను కలిగి ఉన్న BE 6.. సొగసైన కూపే లుక్‌ను స్వీకరించే %ఃజుఎ 9వ% రెండూ 59%ఎెౌత్ర, 79kWh బ్యాటరీ ప్యాక్‌లను పొందుతాయి. ఇవి 170kW, 210kW మోటార్ ద్వారా పవర్ డెలివరీ చేస్తాయి. పూర్తి ఛార్జ్‌పై 683 కిమీ (BE 6) మరియు 656 కిమీ (XEV 9వ) వరకు పరిధిని అందిస్తాయి. మహీంద్రా కంపెనీ దేశీయ విఫణిలో లాంచ్ చేసిన ఎక్స్ఈవీ 9ఈ (XEV 9వ), బీఈ 6 (BE6) ఎలక్ట్రిక్ కార్ల కోసం బుకింగ్స్ స్వీకరించడానికి సన్నద్ధమైంది. కంపెనీ ఫిబ్రవరి 14 నుంచి బుకింగ్స్ ప్రారంభించనుంది. డెలివరీకి సంబంధించిన వివరాలను కూడా సంస్థ వెల్లడించింది.

# గూగుల్ పేలో ఆటోపే..

## సింపుల్‌గా క్యాన్సిల్ చేయండిలా

ఆన్‌లైన్ లావాదేవీలు వచ్చిన తరువాత.. దాదాపు చాలామంది గూగుల్ పే, ఫోన్ పే వంటివి విరివిగా ఉపయోగిస్తున్నారు. సబ్‌స్క్రిప్షన్‌లు, ఈఎంఐ వంటివి చెల్లించడానికి వీటినే వాడేస్తున్నారు. దీనికోసం గూగుల్ పేలోని 'ఆటోపే సెట్ చేసుకుంటారు. ఇది ఆటోమాటిక్ చెల్లింపులకు ఉపయోగపడుతుంది. అయితే కొంతమంది ఆటోమాటిక్‌గా చెల్లించడానికి ఇష్టపడనప్పుడు 'ఆటోపే క్యాన్సిల్ చేసుకోవచ్చు.




### గూగుల్ పేలో ఆటోపే ఎలా నిలిపివేయాలంటే?

- గూగుల్ పే యాప్ ఓపెన్ చేసిన తరువాత, ఎగువ భాగంలో కుడివైపు కనిపించే మీ ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేయాలి.
- ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేసిన తరువాత ఆటోపే ఆప్షన్స్ కనిపించే వరకు కిందికి స్క్రోల్ చేయాలి.
- ఆటోపే ఆప్షన్ కనిపించిన తరువాత.. దానిపైన క్లిక్ చేయాలి. క్లిక్ చేసిన తరువాత లైవ్ ట్యాబ్ కింద యాక్టివ్ మ్యాండేట్‌ల జాబితా కనిపిస్తుంది. మీరు తీసివేయాలనుకుంటున్న ఆటోపే మ్యాండేట్‌పై క్లిక్ చేయండి.
- ఆటోపే క్యాన్సిల్ చేయాలనుకున్నప్పుడు.. క్యాన్సిల్ మీద క్లిక్ చేయాలి. ఆ తరువాత యూపీఐ పిన్ నెంబర్ ఎంటర్ చేయాలి.
- యూపీఐ ఎంటర్ చేయగానే ఆటోపే క్యాన్సిల్ అవుతుంది.

### మళ్ళీ ఆటోపే సెట్ చేసుకోవాలంటే?

- గూగుల్ పేలో మళ్ళీ ఆటోపే సెట్ చేసుకోవాలంటే.. మళ్ళీ యాప్ ఓపెన్ చేసి, ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేసి.. ఆటోపే ఆప్షన్స్ ఎంచుకోవాలి.
- ఉదాహరణకు నెట్‌ఫ్లిక్స్ కోసం ఆటోపే ఆదేశాన్ని సెటప్ చేసి, తరువాత దానిని రద్దు చేసి ఉంటే.. మీరు నెట్‌ఫ్లిక్స్‌లో చెల్లింపు పద్ధతిగా మీ యూపీఐ ఐడీని తిరిగి ఎంటర్ చేయాలి. ఆ తరువాత యధావిధిగా ఆటోపే యాక్టివేట్ అవుతుంది.

### ఆటోపే వల్ల ఉపయోగాలు

- బిజీ జీవితంలో అన్నింటిని గుర్తుపెట్టుకోవడం కొంత కష్టమైన పని. ఏదైనా చెల్లింపులు లేదా ఈఎంఐ వంటి చెల్లించడంలో ఆలస్యమైతే జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి జరిమానాల నుంచి తప్పించుకోవడానికి, సమయానికి చెల్లింపులు పూర్తి చేసుకోవడానికి ఆటోపే అనేది బెస్ట్ ఆప్షన్.




# బంగారం ధరలపై ఊరట.. తగ్గిందా?

బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 79,300, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 86,510 వద్ద ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.86,660 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.79,450 వద్ద ఉన్నాయి. చెన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 79,300 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 86,510 వద్ద కొనసాగుతున్నాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ ధర రూ.1,07,000 వద్ద, ఢిల్లీలో రూ. 99,500 వద్ద నిలకడగా కొనసాగుతున్నాయి.

# ఆశ్చర్యపరుస్తున్న రతన్ టాటా వీలునామా.. ఊహించని వ్యక్తికి ఆస్తిలో భారీ వాటా..

దేశ పారిశ్రామిక ప్రగతికి ఎనలేని కృషి చేసిన రతన్ టాటా గతేడాది అక్టోబర్‌లో కన్నుమూశారు. కాగా ఇటీవల తెరిచిన రతన్ టాటా వీలునామా చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఎందుకంటే అందులో జంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్ రంగ ఎంట్రాప్రెన్యూర్ మోహినీ మోహన్ దత్తా అనే వ్యక్తికి ఆస్తిలో రూ. 500 కోట్లు (రతన్ టాటా మిగిలిన ఆస్తులలో దాదాపు మూడో వంతు) కేటాయించాలనే నిబంధన ఉంది. ఇది టాటా కుటుంబాన్ని మాత్రమే కాకుండా ఆయన సన్నిహితులను కూడా ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే మోహినీ మోహన్ దత్తా అనే వ్యక్తి గురించి అంతర్గతంగా కూడా ఎవరికీ పెద్దగా తెలీదు.



### ఎవరీ మోహినీ మోహన్ దత్తా?

మోహినీ మోహన్ దత్తా జంషెడ్‌పూర్‌లో బాగా స్థిరపడిన వ్యాపారమైన స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీని కలిగి ఉన్న కుటుంబం నుండి వచ్చారు. 2013లో స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీని టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన తాజ్ సర్వీసెస్‌తో విలీనం చేశారు. స్టాలియన్‌లో దత్తా కుటుంబానికి 80% వాటా ఉండగా, మిగిలిన 20% వాటా టాటా ఇండస్ట్రీస్ యాజమాన్యంలో ఉంది. మరో విషయం ఏమిటంటే మోహినీ దత్తా థామస్ కుక్ మాజీ అసోసియేట్ కంపెనీ అయిన టీసీ ట్రావెల్ సర్వీసెస్‌కు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.

### టాటా-దత్తా సంబంధం

మీడియా నివేదికల ప్రకారం.. మోహినీ మోహన్ దత్తా రతన్ టాటాతో దీర్ఘకాల అనుబంధాన్ని కొనసాగించారు. టాటా వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సంబంధాల గురించి బహిరంగ చర్చలలో ఆయన పేరు ప్రముఖంగా లేకపోయినా, టాటా కుటుంబంతోపాటు ప్రైవేట్ సర్కిల్‌లోని ఎంపికచేయదగ్గ వ్యక్తులలో మోహినీ మోహన్ దత్తా ఒకరుగా ఉన్నారు.

### వీలునామా సందేహాస్పదం?

టాటా ట్రస్ట్స్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా మరణం తర్వాత తాజాగా ఈ వీలునామా బయటకు వచ్చింది. ఊహించని విధంగా మోహన్ దత్తాకు రూ.500 కోట్లు కేటాయించడంతో పాటు, మిగిలిన సంపదను ప్రధానంగా దాతృత్వ కార్యక్రమాల కోసం వినియోగించాలని అందులో పేర్కొన్నారు. వీలునామాను అమలు చేసే నలుగురు వ్యక్తులలో (డారియస్ ఖంబటా, మెహ్లి మిస్త్రీతో పాటు) ఉన్న ఆయన సవతి సోదరీమణులు షిరిన్, దినా జజీభోయ్ కూడా తమ వాటాలను దాతృత్వ కార్యక్రమాలకు విరాళంగా ఇవ్వడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు.

కాగా ఈ పరిణామం గురించి వ్యాఖ్యానించడానికి మోహిన్ దత్తా నిరాకరించారు. అదేవిధంగా వీలునామా అమలు చేసేవారు వారు కూడా ఎటువంటి బహిరంగ ప్రకటనలూ జారీ చేయలేదు. ఆస్తి పంపిణీకి సంబంధించి ఆశ్చర్యకరమైన స్వభావం కారణంగా, ముఖ్యంగా బయటి వ్యక్తికి భారీ ఆస్తి కేటాయింపును పరిగణనలోకి తీసుకుంటే, వీలునామా పరిశీలనకు గురికావచ్చని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.




# 8.95 కోట్ల కొత్త రోల్స్ రాయిస్ కారు ఇదే..

రోల్స్ రాయిస్ కంపెనీ.. ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఘోస్ట్ సిరీస్ %××%' ను భారతదేశంలో లాంచ్ చేసింది. ఈ కొత్త వెర్షన్ దాని మునుపటి మోడల్‌లో అందుబాటులో లేని కొత్త ఇంటీరియర్ ఫినిషింగ్‌లు, ఫీచర్లను పొందిందని సంస్థ వెల్లడించింది. రోల్స్ రాయిస్ ఘోస్ట్ సిరీస్‌లో.. మూడు వెర్షన్స్ ఉన్నాయి. అవి ఘోస్ట్ సిరీస్ %××%, ఘోస్ట్ ఎక్స్‌టెండెడ్ సిరీస్ %××%, బ్లాక్ బ్యాడ్జ్ ఘోస్ట్ సిరీస్ %××%. వీటి ధరలు వరుసగా రూ. 8.95 కోట్లు, 10.19 కోట్లు,10.52 కోట్ల ఎక్స్-షోరూమ్ ధరలకు అందుబాటులో ఉన్నాయి. ఈ కారు కోసం చెన్నై, న్యూఢిల్లీ షోరూమ్‌లలో బుక్ చేసుకోవచ్చు. రోల్స్ రాయిస్ ఘోస్ట్ సిరీస్ %××% కారు 6.75 లీటర్, ట్విన్ టర్బోచార్జ్ వీ12 ఇంజిన్‌ను పొందుతుంది, ఇది వరుసగా 600 హార్స్ పవర్, 900 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇది 8 స్పీడ్ గేర్‌బాక్స్ ద్వారా అత్యద్భుతమైన డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది. ఘోస్ట్ సిరీస్ %××% మెరుగైన రైడ్ స్టెబిలిటీ కోసం ప్లానార్ సస్పెన్షన్ సిస్టమ్, రోడ్డు పరిస్థితికి అనుగుణంగా సస్పెన్షన్లను అడ్జెస్ట్ చేయడానికి కెమెరాల సహాయంతో ఫ్లాగ్ బేరర్ సిస్టమ్ వంటి టెక్నాలజీ అప్‌గ్రేడ్‌లను పొందుతుంది. ఇది మెరుగైన ఆడియో సిస్టమ్, ఇంటర్నెట్ కనెక్టివిటీ, వీడియో స్ట్రీమింగ్ ఫంక్షన్‌లను కూడా పొందుతుంది.




## ‘మీ నాన్నకు తెలియనంత జాబ్ ఏం చేస్తున్నావ్?’..

టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ జాక్’ మూవీతో అభిమానులను అలరించనున్నారు. గతేడాది టిల్లు స్క్వేర్‌తో ఫ్యాన్స్‌ను మెప్పించిన సిద్ధు మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు సిద్ధమయ్యారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తోన్న జాక్‌లో బేబీ ఫేమ్ వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఇవాళ సిద్ధు పుట్టిన రోజు కావడంతో మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. తాజాగా జాక్ మూవీ టీజర్‌ను ఫ్యాన్స్‌కు పరిచయం చేశారు. టీజర్ చూస్తే తండ్రి, కుమారుల మధ్య జరిగే స్టోరీగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇందులో సన్నివేశాలు ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్లు అర్థమవుతోంది. బేబీ ఫేమ్ వైష్ణవి చైతన్య, సిద్ధు మధ్య వచ్చే డైలాగ్స్ ఫ్యాన్స్‌ను అలరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, వీకే నరేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.’



## మీ గుర్తింపు ఆయన సేవలకు నిదర్శనం: నాగార్జున్ ట్వీట్

భారత ప్రధాని నరేంద్ర మోదీకి హీరో అక్కినేని నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ రాసిన ‘అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ’ పుస్తకాన్ని ప్రధానికి అందజేశారు. మీకు ఈ పుస్తకాన్ని అందించడం గౌరవంగా భావిస్తున్నన్నట్లు వెల్లడించారు. ఇది నా తండ్రి ఏఎన్నార్ సినిమా వారసత్వానికి నివాళిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆయన సేవలను మీరు గుర్తించడం మా కుటుంబం, అభిమానులు, భారతీయ సినీ ప్రేమికులకు ఒక విలువైన జ్ఞాపకమని నాగార్జున ట్వీట్ చేశారు. పార్లమెంట్ హౌస్‌లో అక్కినేని కుటుంబ సభ్యులంతా ప్రధానిని కలిసి ఫోటో దిగారు. నాగార్జునతో పాటు అక్కినేని అమల, నాగచైతన్య, శోభిత ధూళిపాల కూడా నరేంద్ర మోదీని కలిశారు. కాగా.. ఇటీవల మన్ కీ బాత్‌లో తెలుగువారి లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే.

## థ్రిల్లింగ్ శబ్దం



‘వైశాలి’ వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం ‘శబ్దం’. లక్ష్మీ మీనన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిమ్రాన్, లైలా, రాజీవ్ మీనన్ తదితరులు ఇతరపాత్రలు పోషించారు. తెలుగు, తమిళ భాషల్లో శివ నిర్మించారు. ఈ నెల 28న తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగులో ఎన్ సినిమాస్ ద్వారా రిలీజ్ అవుతోంది. “సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘శబ్దం’. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని పొందేలా విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ ఎఫెక్ట్స్ ఉంటాయి” అని చిత్రయూనిట్ పేర్కొంది.



## సోనుసూద్‌ను అరెస్ట్ చేయండి..
# కోర్టు ఆదేశాలు

పాటియాలా: ప్రముఖ నటుడు సోనుసూద్‌కు బిగ్ షాక్ తగిలింది. తాజాగా ఆయనకు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది పంజాబ్‌లోని లూథియానా కోర్టు. ఈ మేరకు సోనుసూద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మోసం కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి రాకపోవడంతో కోర్టు ఇలా ఆదేశించింది. వివరాల ప్రకారం.. నటుడు సోనుసూద్ కు లూథియానా కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. కాగా, లుథియానాకు చెందిన న్యాయవాది రాజేశ్ ఖన్నా తనకు మోహిత్ శర్మ అనే వ్యక్తి రూ.10 లక్షలు మోసం చేశాడని కోర్టులో కేసు వేశారు. రిజికా కాయిన్ పేరుతో తనతో పెట్టుబడి పెట్టించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో సదరు న్యాయవాది సోనూసూద్‌ను సాక్షిగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై విచారణ చేపట్టిన లూథియానా కోర్టు.. సోనుసూద్‌కు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పిటిషన్‌పై విచారణ అనంతరం..‘సోనుసూద్‌కు పలుమార్లు సమన్లు పంపించినప్పటికీ అతను హాజరుకాలేదు. వెంటనే అతడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలి అని ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసు ఈ నెల 10న మరోసారి విచారణకు రానుంది. ఇక, సోనుసూద్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఆయన అభిమానుల్లో ఆందోళన నెలకొంది. సోనుసూద్ తెలుగు సహా బాలీవుడ్‌లో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే.



# స్పెషల్ సాంగ్?

‘దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి’ అనే సామెత చిత్ర పరిశ్రమలో బాగా వినిపిస్తుంటుంది. ఈ విషయంలో హీరోయిన్లు ఎప్పుడూ ముందుంటారు. ఓ వైపు హీరోకి జోడీగా నటించి, ప్రేక్షకులను అలరిస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్‌లో నటించేందుకు పలువురు కథానాయికలు పచ్చజెండా ఊపుతుంటారు. ఇప్పటికే సమంత, తమన్నా, కాజల్ అగర్వాల్, పూజా హెగ్డే, శ్రుతీహాసన్, శ్రీలీల, రెజీనా, ఫరియా అబ్దుల్లా వంటి పలువురు కథానాయికలు ప్రత్యేకపాటల్లో చిందేశారు.

తాజాగా ఈ జాబితాలో హీరోయిన్ కృతీ శెట్టి కూడా చేరనున్నారని బాలీవుడ్ టాక్. ‘ఉప్పెన’ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ బేబమ్మగా అభిమానుల మనసులో స్థానం సంపాదించుకున్నారు. తొలి సినిమాతోనే వంద కోట్ల క్లబ్‌లో చేరిన హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ కన్నడ బ్యూటీ ‘శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ, మనమే’ వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు.

2024 జూన్ 7న విడుదలైన ‘మనమే’ సినిమా తర్వాత కృతీ శెట్టి తెలుగులో ఏ సినిమా కూడా కమిట్ కాలేదు. అయితే తమిళ చిత్రాలతో మాత్రం ఫుల్ బిజీగా ఉన్నారామె. ఇదిలా ఉంటే.. కృతీ శెట్టి బాలీవుడ్‌లో ఓ స్పెషల్ సాంగ్ చేయనున్నారని టాక్. అద్భుతమైన డ్యాన్స్ చేయడంలో ఆమెకు మంచి పేరుంది. అందుకేనేమో... ప్రత్యేకపాటలో మెరిసేందుకు సై అన్నారని టాక్. అయితే ఆమె ఏ సినిమాలో స్పెషల్ సాంగ్ చేయనున్నారు? ఇందులో వాస్తవం ఎంత? అనే విషయాలపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

## తండేల్ రిలీజ్..
### అలా మొదటిసారి చూసే అవకాశం: శోభిత ధూళిపాల

అక్కినేని హీరో నాగచైతన్య ప్రస్తుతం తండేల్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. శోభితతో పెళ్లి తర్వాత వస్తోన్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చందు మొండేటి దర్శకత్వంలో ఈ సినిమాను



తెరకెక్కించారు. ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల థియేటర్లలో విడుదలైంది. మత్స్యకార బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ చిత్రంలో నేచురల్ బ్యూటీ సాయిపల్లవి హీరోయిన్‌గా నటించింది. రియల్ స్టోరీ ఆధారంగా తండేల్ సినిమాను తెరకెక్కించారు. అయితే శోభిత తన భర్త సినిమా రిలీజ్‌కు ముందు చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మూవీ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఈ సినిమా విడుదల పట్ల సంతోషంగా ఉన్నానని తెలిపింది. ఈ చిత్రం కోసం మీరు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసని అన్నారు. ఈ లవ్ స్టోరీని థియేటర్లలో చూసేందుకు ఎంతో ఆతృతగా ఉందని శోభిత తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అంతేకాదు ఇకనైనా మీరు గడ్డం గీసుకుంటారు.. మొదటిసారి గడ్డం లేకుండా నీ ముఖం చూసే దర్శనభాగ్యం కలుగుతుంది సామీ అని ఆమె రాసింది.’ అంటూ తెలుగులోనే రాసుకొచ్చింది. కాగా.. గతేడాది డిసెంబర్‌లో శోభిత ధూళిపా-నాగచైతన్య వివాహబంధంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వేదికగా గ్రాండ్ వెడ్డింగ్ వేడుక జరిగింది. ఈ పెళ్లికి టాలీవుడ్ సినీ ప్రముఖులు, సన్నిహితులు హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరిద్దరి పెళ్లి తర్వాత వస్తోన్న తొలి చిత్రం కావడంతో శోభిత దూళిపాల తన ప్రేమను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.




# బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్-2025 విజేత ఫార్చ్యూన్ బారిషల్

బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్-2025 ఎడిషన్ విజేతగా ఫార్చ్యూన్ బారిషల్ నిలిచింది. ఇవాళ (ఫిబ్రవరి 7) జరిగిన ఫైనల్లో బారిషల్.. చిట్టగాంగ్ కింగ్స్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిట్టగాంగ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఓపెనర్లు ఖ్వాజా నఫే (66), పర్వేజ్ హొస్సేన్ ఎమోన్ (78 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 121 పరుగులు జోడించారు. ఆతర్వాత వచ్చిన గ్రహం క్లార్క్ (44) కూడా రాణించడంతో కింగ్స్ భారీ స్కోర్ చేసింది. బారిషల్ బౌలర్లలో మొహమ్మద్ అలీ, ఎబాదత్ హొసేన్ తలో వికెట్ పడగొట్టారు.

195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బారిషల్‌కు కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ (54), తౌహిద్ హృదోయ్ (320 శుభారంభాన్ని అందించారు. అనంతరం కైల్ మేయర్స్ (46) మెరుపు ఇన్నింగ్స్ ఆడి బారిషల్‌ను విజయానికి చేరువ చేశాడు. ఆఖర్లో రిషద్ హొసేన్ (18 నాటౌట్) రెండు సిక్సర్లు బాది బారిషల్‌కు విజయాన్ని ఖరారు చేశాడు. మరో మూడు బంతులు మిగిలుండగానే బారిషల్ విజయతీరాలకు చేరింది. కింగ్స్ బౌలర్లలో షోరిఫుల్ ఇస్లాం 4 వికెట్లు తీసి బారిషల్‌ను భయపెట్టాడు. నయీమ్ ఇస్లాం 2, బినుర ఫెర్నాండో ఓ వికెట్ పడగొట్టారు. ఫార్చ్యూన్ బారిషల్ టైటిల్ సాధించడం వరుసగా ఇది రెండో సారి కావడం విశేషం.

# అతడినే పక్కనపెడతారా?: ఆసీస్ దిగ్గజం

టీమిండియా స్టార్ శ్రేయస్ అయ్యర్ పై ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ రిక్కీ పాంటింగ్ ప్రశంసలు కురిపించాడు. మిడిలార్డర్‌లో చక్కగా రాణించగల నైపుణ్యాలు అతడి సొంతమని కొనియాడాడు. అయితే, గత రెండేళ్లుగా టీమిండియా యాజమాన్యం అయ్యర్‌కు అడపాదడపా మాత్రమే అవకాశాలు ఇవ్వడం తనకు విస్మయం కలిగిస్తోందని పేర్కొన్నాడు. కాగా స్వదేశంలో గతేడాది ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా వెన్నునొప్పితో జట్టుకు దూరమైన శ్రేయస్ అయ్యర్.. ఆ తర్వాత కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాడు. రంజీల్లో ఆడాలన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆదేశాలను తొలుత బేఖాతరు చేసిన ఈ ముంబైకర్.. తర్వాత గాయాన్ని సాకుగా చూపి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో బీసీసీఐ అయ్యర్‌పై కఠిన చర్యలు తీసుకుంది. అతడి సెంట్రల్ కాంట్రాక్టు రద్దు చేస్తూ వేటు వేసింది. ఈ తర్వాత అతడు దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగి తనను తాను నిరూపించుకున్నాడు. అంతేకాదు.. ఐపీఎల్-2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్‌గా టైటిల్ గెలిచాడు.

టీ20 జట్టులో మాత్రం చోటు కరువు

ఈ నేపథ్యంలో గతేడాది శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడే అవకాశం దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్.. టీ20 జట్టులో మాత్రం చోటు సంపాదించలేకపోయాడు. యాజమాన్యం అతడిని ఎప్పటికప్పుడు పక్కనపెట్టి.. కొత్త ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చింది. టీ20 ప్రపంచకప్-2024 జట్టులోనూ అతడికి చాన్స్ ఇవ్వలేదు.

ఇక తాజాగా ఇంగ్లండ్‌తో స్వదేశంలో వన్డే సిరీస్ సందర్భంగా పునరాగమనం చేసిన శ్రేయస్ అయ్యర్.. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి వన్డేలో అదరగొట్టాడు. కేవలం 36 బంతుల్లోనే 59 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో తొమ్మిది ఫోర్లతో పాటు రెండు సిక్సర్లు ఉండటం విశేషం. అయితే, ఈ మ్యాచ్‌లో తనకు తొలుత తుదిజట్టులో స్థానం లేదని.. విరాట్ కోహ్లి గాయపడ్డ కారణంగానే తనను పిలిపించారని శ్రేయస్ అయ్యర్ స్వయంగా వెల్లడించాడు. ఈ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫామ్‌లో ఉన్న ఆటగాడిని బెంచ్‌కే పరిమితం చేయాలని చూడటం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అద్భుతమైన ఆటగాడు..

ఈ నేపథ్యంలో లెజెండరీ బ్యాటర్ రిక్కీ పాంటింగ్ ఐసీసీ రివ్యూ షోలో మాట్లాడుతూ.. "గత రెండేళ్లుగా అతడి సేవలను ఎందుకు సరిగ్గా ఉపయోగించుకోవడం లేదో అర్థం కావడం లేదు. వన్డే ప్రపంచకప్-2023లోనూ శతకాలతో చెలరేగి భీకరమైన ఫామ్ కనబరిచాడు. మిడిలార్డర్‌లో సొగసైన బ్యాటింగ్‌తో అలరించాడు. దీంతో జట్టులో అతడి స్థానం సుస్థిరమైందని నేను అనుకున్నా. కానీ అలా జరుగలేదు. వెన్నునొప్పి కారణంగా అతడు జట్టులో స్థానం కోల్పోయాడు. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

అయినా.. అతడిని పక్కనపెట్టాలని చూడటం సరికాదు" అని అభిప్రాయపడ్డాడు. కాగా ఐపీఎల్-2025లో పంజాబ్ కింగ్స్ హెడ్‌కోచ్‌గా పాంటింగ్ నియమితుడైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వేలంలో భాగంగా శ్రేయస్ అయ్యర్‌ను పంజాబ్ రూ. 26.75 కోట్లకు కొనుగోలు చేయడంలో పాంటింగ్ కీలక పాత్ర పోషించాడు. వీరిద్దరు కలిసి గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున పనిచేశారు కూడా!



# విరాట్ కోహ్లిని అధిగమించిన స్టీవ్ స్మిత్

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ సెంచరీతో కదంతొక్కాడు. టెస్ట్‌ల్లో స్టీవ్‌కు ఇది 36వ సెంచరీ. ఈ సెంచరీతో స్టీవ్ పలు రికార్డులు నెలకొల్పాడు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న క్రికెటర్లలో అత్యధిక సెంచరీలు (జో రూట్‌తో కలిసి) చేసిన ఆటగాడిగా నిలిచాడు. రూట్, స్టీవ్ ప్రస్తుతం టెస్ట్‌ల్లో తలో 36 సెంచరీలు చేశారు.



టెస్ట్‌ల్లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో స్టీవ్ ఐదో స్థానానికి ఎగబాకాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (51) అగ్రస్థానంలో ఉండగా.. జాక్ కల్లిస్ (45), రికీ పాంటింగ్ (41), కుమార సంగక్కర (38) ఆతర్వాతి స్థానాల్లో నిలిచారు.

ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న క్రికెటర్లలో అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో స్మిత్ మూడో స్థానానికి ఎగబాకాడు. స్మిత్, రోహిత్ శర్మ తలో 48 అంతర్జాతీయ శతకాలతో మూడో స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో విరాట్ (81 సెంచరీలు) టాప్‌లో ఉండగా.. రూట్ (52) రెండు, కేన్ విలియమ్సన్ (46) నాలుగో స్థానంలో ఉన్నారు.

విరాట్‌ను అధిగమించిన స్టీవ్

విదేశాల్లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో స్టీవ్.. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని అధిగమించాడు. విరాట్ ఇప్పటివరకు విదేశాల్లో 16 సెంచరీలు చేయగా.. తాజా సెంచరీతో స్టీవ్ విదేశీ సెంచరీల సంఖ్య 17కు పెరిగింది.

తాజా సెంచరీతో స్టీవ్.. అలిస్టర్ కుక్, బ్రియాన్ లారా సరసన చేరాడు. కుక్, లారా ఇద్దరూ విదేశాల్లో తలో 17 టెస్ట్ సెంచరీలు చేశారు. ఈ సెంచరీతో స్టీవ్.. విదేశీ టెస్ట్‌ల్లో ఆస్ట్రేలియా తరఫున అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగానూ రికార్డు నెలకొల్పాడు. ఈ సెంచరీతో స్మిత్ ఆసియాలో అత్యధిక టెస్ట్ సెంచరీలు (7) చేసిన ఆస్ట్రేలియా ఆటగాడిగా అవతరించాడు. ఆసియాలో అలెన్ బోర్డర్ 6, రికీ పాంటింగ్ 5 సెంచరీలు చేశారు.

మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకు ఆలౌటైంది. చండీమల్ (74), కుసాల్ మెండిస్ (85 నాటౌట్) అ[illegible]ర్ధ సెంచరీలతో రాణించి శ్రీలంకకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న దిముత్ కరుణరత్నే 36 పరుగులకే ఔటయ్యాడు. రమేశ్ మెండిస్ (28), కమిందు మెండిస్ (13), పథుమ్ నిస్సంక (11) రెండంకెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కుహ్నెమన్, లయోన్ తలో మూడు వికెట్లు పడగొట్టగా.. ట్రవిస్ హెడ్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.



# 'రోహిత్ కెప్టెన్సీలో ఆ ఇద్దరు కలిసి ఆడతారని అస్సలు అనుకోలేదు'

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను టీమిండియా విజయంతో ఆరంభించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో నాగ్‌పూర్ వేదికగా పర్యాటక జట్టును నాలుగు వికెట్ల తేడాతో ఓడించి 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక ఈ మ్యాచ్‌లో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.. ఇద్దరూ అదరగొట్టడం విశేషం. ఈ నేపథ్యంలో భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఇలా జడ్డూ, అక్షర్ కలిసి ఆడతారని తాను అస్సలు ఊహించలేదన్నాడు. ఏదేమైనా ఈ మ్యాచ్‌లో ఇద్దరు రాణించడం శుభసూచకమని.. అయితే అక్షర్ కంటే జడ్డూ మెరుగ్గా బౌలింగ్ చేశాడని కితాబిచ్చాడు.

**జడ్డూ, అక్షర్.. ఒకరు బౌలింగ్‌లో.. ఒకరు బ్యాటింగ్‌లో**

కాగా ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు కీలక వికెట్లు తీశాడు. తొమ్మిది ఓవర్ల బౌలింగ్‌లో కేవలం 26 పరుగులే ఇచ్చి స్టార్ బ్యాటర్లు జో రూట్(19), జొకొబ్ బెతెల్(51) వికెట్లతో పాటు.. టెయిలెండర్ ఆదిల్ రషీద్(8)ను అవుట్ చేశాడు. ఇక లక్ష్య ఛేదనలో భాగంగా జడేజాకు ఎక్కువగా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. మొత్తంగా 10 బంతులు ఎదుర్కొని 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరోవైపు.. జోస్ బట్లర్ (52) రూపంలో బిగ్ వికెట్ దక్కించుకున్న మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్.. బ్యాటర్‌గానూ దుమ్ములేపాడు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అక్షర్ పటేల్ 47 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌సాయంతో 52 పరుగులు సాధించాడు. ఈ నేపథ్యంలో కామెంటేటర్ ఆకాశ్ చోప్రా వీరిద్దరి గురించి తన అభిప్రాయాలు పంచుకున్నాడు.

"ఈ మ్యాచ్ సందర్భంగా రవీంద్ర జడేజా అంతర్జాతీయ క్రికెట్‌లో 6000 పరుగులు పూర్తి చేసుకోవడంతో 600 వికెట్ల క్లబ్‌లో చేరాడు. తద్వారా భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి స్పిన్నర్‌గా రికార్డు సాధించాడు. అంతకు ముందు ఫాస్ట్‌బౌలర్ కపిల్ పాజీ ఈ ఫీట్ అందుకున్నాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో అతడికి ఆడే అవకాశం వస్తుందా లేదా అన్న సందేహం ఉండేది. ఎందుకంటే.. చాంపియన్స్ ట్రోఫీ జట్టులో అతడు పదిహేనవ ఆటగాడిగా ఉన్నాడు.

# ఒడిశాపై గోవా గెలుపు

గోవా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) 2%-%1 స్కోరుతో ఒడిశా జట్టుపై విజయం సాధించింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో గోవా తరఫున బ్రిసన్ డ్యూబెన్ ఫెర్నాండెజ్ 29వ నిమిషంలో గోల్ సాధించి గోవాకు తొలి ఆధిక్యం ఇచ్చాడు. ఒడిశా ఆటగాడు లాల్తతంగ ఖవిహ్‌రింగ్ (47వ నిమిషంలో) చేసిన సెల్ఫ్ గోల్ గోవా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది.

54వ నిమిషంలో ఒడిశా స్ట్రయికర్ కేపీ రాహుల్ గోల్ చేసినప్పటికీ గోవా విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో ఒడిశా తమ దాడులకు పదునుపెట్టలేకపోయింది. అవతలివైపు నుంచి గోవా ఎఫ్‌సీ ఆటగాళ్లు మాత్రం పదేపదే ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌వైపు దూసుకొచ్చి ఏకంగా 20 షాట్లు కొట్టారు. లక్ష్యంపై ఆరుసార్లు గురిపెట్టగా ఒకసారి గోల్‌తో విజయవంతమైంది.

ఒడిశా 15 షాట్లు ఆడినా... కేవలం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై రెండే సార్లు దాడి చేసింది. ఇందులో ఒకసారి మాత్రం ఫలితాన్ని సాధించింది. గోవా ఆటగాళ్లు మైదానంలో పాదరసంలా కదిలారు. బంతిని ప్రత్యర్థులకంటే తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అదేపనిగా చకచకా పాస్‌లు చేశారు. శుక్రవారం షిల్లాంగ్‌లో జరిగే పోరులో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టుతో ముంబై సిటీ ఎఫ్‌సీ తలపడుతుంది.

